

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహాలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 52 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

కృష్ణమాచార్యుల రూపం నీటి అలల మధ్యన మెరుపు వలయాలలా కనుమరుగైపోతున్నది. యేవేవో దృశ్యాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక భారీకొండ కనిపించింది. ఆ కొండ మీది కోవెల శిఖరధ్వజం చిరుగాలికి ఎగురుతూ కనిపించింది. కోవెల గంటలు మధురంగా వినిపిస్తున్నాయి. ఉలులతో తొలిచిన మెట్లదారి కనిపించింది. ఆ కొండ, దేవాలయం, పరిసరాలు అంతకు ముందు చూసినవాటిలా కనిపించాయి.

కలలో కనిపించినట్లు కనిపిస్తున్నది అంతా. చప్పున స్ఫురించింది కృష్ణరాయలకు. అది స్థంభాద్రి నృసింహస్వామి కోవెల. ఆ మహాపర్వతం స్థంభాద్రి! అంతలో దృశ్యం మారిపోయింది. రెండుచేతులూ నెత్తిన పెట్టుకుని ఆనందపారవశ్యంతో ఊగిపోతూ అడుగులేస్తున్న కృష్ణమాచార్యులు కనిపించాడు. కదలి కెరటాలలాగా ఎగసిపడుతున్నట్లు తలలు ఊపుతున్న కొబ్బరిచెట్ల గుంపులు కనిపించాయి. బంగారు రంగులో మెరిసిపోతున్న అలయశిఖరాల కలశాలు కనిపించాయి. ఏడు శిఖరాలు!

' రంగనాథా! రంగనాథా!' అన్న నాదాలు చెలరేగుతున్నాయి. జయజయ ధ్వానాలు, శరణాగతి ఘోషలూ వినిపిస్తున్నాయి. ఆద్యంతాలు తెలియని శ్యామల సుందరమూర్తి కనిపిస్తున్నది. అది నల్లని శిలామూర్తి. రాగిరేకులను శిరస్సుమీద పెట్టుకుని ఆ శిలామూర్తి పాదాల చెంత కనిపించాడు కృష్ణమాచార్యులు. శరీరం గగుర్పాటుతో పులకించిపోయింది కృష్ణరాయలకు. ఎంత అందమైన పాదాలు! ఏదో ఆకర్షణ పట్టిలాగుతున్నది ఆ పాదాలలో.

చెల్లాచెదురై తేలిపోతున్న అలల మధ్యన కరిగిపోతున్నట్లు కనుమరుగైపోతున్నది కృష్ణమాచార్యుల ముఖం. ఆ స్థానంలో అప్పుడే వికసించిన పద్మంలాంటి అందమైన ముఖం కనిపించింది. ఒక్కసారి చూస్తే వశులైపోయే అందమైన ముఖం. అంతకు ముందు చూసిన ముఖమే అనిపించింది. ఒక్కసారిగా 'మోహనాంగి!' అనుకున్నాడు కృష్ణరాయలు. కృష్ణమాచార్యులను దాసుడిని చేసుకున్న అందం అది. ఇంతలోనే ఆ ముఖం మబ్బులమాటున పల్చగా కనిపించే నిండుచంద్రబింబంలా మసకబారింది. మరుక్షణంలోనే మబ్బులు తొలిగిన పున్నమి చంద్రబింబంలా కనిపించింది.

ఆ ముఖమేనా? అవుననే అనిపించింది కృష్ణరాయలకు. అది మోహనాంగి ముఖంలానే కనిపించింది. అంతలోనే కొద్దిగా వేరుగా కనిపించింది. మోహనాంగి ముఖమే మరింత ప్రకాశవంతంగా కనిపించింది. కాదు! అచ్చు మోహనాంగిలానే వున్న మరొక అప్సర రూపం! ఈ ముఖానికి ఎడమ బుగ్గ మీద కందిగింజంత ముద్దైన నల్లని మచ్చ కనిపిస్తున్నది. చంద్రబింబంలో మచ్చలా వున్నది ఆమె ముఖచంద్రబింబానికున్న ముద్దైన పుట్టుమచ్చ. ఆ అందం, ఆ ఆకర్షణ, మానవమాత్రులకు లభించేది కాదు. అది దేవతాస్త్రీలకు కూడా అరుదుగా లభించే అందం!

'కృష్ణోబా!' అంటూ లీలగా సమర్థరాముడి కంఠం వినిపించింది. ఎక్కడో సుదూర తీరాలనుండి వినిపించి, క్రమక్రమంగా దగ్గరవుతున్నట్లు వినిపించింది ఆ పిలుపు. అది సాయం సమయమా? ఉదయమా? అర్థం కావడంలేదు కృష్ణరాయలకు. చల్లని గాలి శరీరానికి సోకుతున్నది. ఒళ్లంతా తీయని పులకింతలతో సన్నగా కంపించి పోవడం తెలుస్తున్నది. మూసిన కనులకు యేవో దివ్యకాంతిపుంజాలు ధారలు ధారలుగా కురుస్తున్నట్లు సోకుతున్నాయి. కనులు తెరిచి చూడాలి అనిపించని మధురమైన మత్తు మబ్బులు అలుముకున్నట్లు అలుముకుని వున్నది. అది మెలకువ, నిద్ర కాని విచిత్రమైన స్థితి. స్వప్నంలోలా తనకు తనే వేరుగా కనిపిస్తున్న అనుభూతి.

'మానవజన్మలు ఒక పెద్ద స్వప్నంలో చిన్న స్వప్నాలవంటివి కృష్ణోబా! అంతు తెలియని కాలసముద్రంలో ఏ మధ్యలోనో, ఎక్కడో తెలియకుండా మొదలై తేలుతూ వచ్చే అలల లాంటివి! ప్రతి అలకూ ఒక పుట్టుక స్థానం వున్నది, మామూలు కనులకు కనబడదు! ప్రతి కథకు ఒక కారణం వున్నది, సామాన్యులు కనుగొనలేరు, అంతే! మూలం కనిపించనంత మాత్రాన వేర్లు లేకుండానే మహావృక్షం ఎదుగుతుందని అనుకుంటామా?'

మధురమైన సమర్థరాముడి కంఠం మాత్రం స్పష్టంగా వినిపిస్తున్నది. మిగిలినదంతా స్వాప్నికమైన అనుభూతి! ప్రశాంతంగా బోధ చేస్తున్నట్లు సమర్థుని గొంతు ధ్వనిస్తున్నది.

'కృష్ణోబా! నేను ముక్తివరం రావడానికి రెండురోజులముందు భయంకరమైన అనుభవం కలిగింది నీకు! మహా భయంకరమైన కాలసర్పం నిన్ను కబళించాలని చూసింది. దైవానుగ్రహంలా దేవతాసర్పం అడ్డుపడ్డది. ఆ శ్వేతనాగు ఆ కాలసర్పాన్ని నిరోధించింది. నిన్ను కాపాడింది. ఆ కాలనాగు కక్షకు, శ్వేతనాగు రక్షకు జన్మాంతరాల కారణాలున్నాయి కృష్ణోబా! మామూలు కనులకు కనబడని దృశ్యాలు. ఒకవేళ దురదృష్టవశాత్తూ కనబడితే తట్టుకోలేక కనులు మాడిపోయే దృశ్యాలు అవి.'

' అమాయకుడైన నాగిశెట్టి కనులు పిడుగుపాటు కారణంగా మాడిపోలేదు కృష్ణోబా! దివ్యసర్పాన్ని చూడడం వలన, ఆ కాంతిని భరించలేక అతడి దృష్టి పోయింది. పిడుగుపాటు కాకతాళీయం. అతడు చూడగలగడం కూడా జన్మాంతర వాసనా బలమే కృష్ణోబా! అతడూ జన్మంతరాలనుండి నిన్ను అనుసరిస్తూనే వున్నాడు. పూర్వజన్మల సంబంధ కారణం లేకుండా ఈ ప్రపంచంలో ఎవరికీ ఎవరితోనూ కలయిక, విడిపోవడము జరగదు కృష్ణోబా!'

'ఈ కొద్దిరోజులుగా ఎప్పటికప్పుడు ఆ కాలసర్పం కసికి కారణం ఏమిటో అడుగుదామనుకుని సంశయంతో ఆగిపోయావు. ఈ జన్మలో నీవు కలిసిన ప్రతివ్యక్తితో నీకు పూర్వజన్మల సంబంధం వున్నది కృష్ణోబా, నాతో సహా! ఈ రామదాసుకూ, ఆ భద్రాచల రామదాసుకూ కలిగిన సంపర్కం ఈనాటిది కాదు.'

'ఆ జన్మ జన్మల కథనే నువ్వు స్వయంగా చూస్తున్నావు కృష్ణోబా! ఆ దివ్యదృష్టి నీకు లభించడం కోసమే నీకు కుండలినీ శక్తిని ప్రసాదించాను. నీ పూర్వజన్మల వాసనా ప్రభావం వల్ల, నా అనుగ్రహం వల్ల ఒక్క రోజుకే నీకు కుండలిని మేలుకున్నది కృష్ణోబా!'

'అనంతజన్మల ఈ కథను అవసరమైన మేరకే చూద్దువుగాని. మరలా అనుభవిద్దువుగాని. నాగుమయ్యను చూశావు. నాగసాధువుగా మారి, నాగసర్పపు కోరలకు బలైన సదాశివశాస్త్రిని చూశావు. సదాశివశాస్త్రిని బలితీసుకున్న ఆ కాలసర్పము నిన్ను అనేక జన్మలుగా అనుసరిస్తున్నది కృష్ణోబా!' అని ఒకనిముషం ఆగిపోయింది సమర్థరాముడి కంఠం. సుడిగాలికి పూలతీగలా చలించిపోయింది కృష్ణరాయల శరీరం, ఒకే ఒక్క క్షణం. ఏదో

అడుగుదామనుకున్నాడు. నేను నాగుమయ్యనా? నేను సదాశివశాస్త్రినా? కృష్ణమాచార్యులు నేనేనా? ఒకేసారి అన్ని ప్రశ్నలు మనసులో మెదిలాయి. అడగకమునుపే మరలా ఆ ఆనందకరమైన మైకం అలుముకున్నది!

' నాగుమయ్యకు, సదాశివశాస్త్రికి, కృష్ణమాచార్యులకు, నీకు విడదీయరాని బంధం వున్నది కృష్ణోబా! అది కూడా అనేకజన్మల సంబంధమే. యింతటికీ మూలం యిప్పటికి రెండువేల సంవత్సరాలకు పూర్వమే పురుడు పోసుకున్న పుణ్యచరిత్ర కృష్ణోబా! కృష్ణమాచార్యుల మోహనాంగికి, నువ్వు చూస్తున్న భువన సుందరికి విడదీయరాని బంధం వున్నది కృష్ణోబా!

ఏవో రాజసౌధపు గోడలమీద చిత్రించిన వర్ణచిత్రాలలా యేవేవో ఆకృతులు కృష్ణరాయల కనులకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొన్ని పరిచయమున్న వ్యక్తుల మూర్తులు. కొన్ని సుందరీమణుల ఆకృతులు. కొన్ని భయంకరమైన ప్రకృతులు. నాగుమయ్యభుజం మీది సంపంగి కనిపించింది. కృష్ణమాచార్యుల కౌగిలిలో మోహనాంగి కనిపించింది. ఇప్పుడు మరలా ఆ నవ్వు ముఖం కనులముందు నిలిచిపోయింది!

అదే ముఖం! ఎడమ చెంప మీద అదే అందమైన నల్లని కందిగింజంత పుట్టుమచ్చ. అవే చేపల లాంటి విశాలమైన నేత్రాలు, అవి మధుపాత్రలు. ఆ అందం కృష్ణరాయలను సమ్మోహితుడిని చేస్తున్నది. ఆ నవ్వు, ఆ చూపులు, ఆ చెక్కిళ్ళు, ఆ చుబుకం, ఆ శరీర పరిమళం, ఆ అణువణువూ చిరపరిచితమైన విభ్రాంతి కలిగిస్తున్నది.

'కృష్ణోబా! ఇక మరలా చూడు! అనంత కాలప్రయాణంలో రెండువేల సంవత్సరాల వెనక్కు వెళ్ళు! ఈ కథలో మరలా పాత్రవైపో! యిది సాక్షాత్తూ ఆదిశంకరుల ఆశీస్సులతో ఆరంభమైన కథ! కాళిదాసు కరుణతో కలిగిన కథ! ఈ కథకు యిది ఆది! ఈ పవిత్ర చరిత్రకు యిది పునాది! మరలా అనుభవించు కృష్ణోబా!' మంత్ర బోధ చేస్తున్నట్లు సమ్మోహనంగా ఆలపించిన రాగం ఆగిపోయినట్లు మౌనం వహించింది సమర్థరాముడి కంఠం.

భవానీద్వీపం కుతూహలంగా, నిశ్శబ్దంగా చెవులు రిక్కించి వింటున్నట్లు అంతటా సద్దుమణిగింది. చుక్కలు నీలాకాశంలో తళుకుమంటున్నాయి మెరుస్తున్న కళ్ళతో భవానీద్వీపం గమనిస్తున్నట్లు. సన్నగా కృష్ణమ్మ అలల సడులు వినిపిస్తున్నాయి భవానీద్వీపం ఉద్విగ్నతతో నెమ్మదిగా ఊపిరి పీలుస్తున్నట్లు. కృష్ణరాయల కనుల ముందర వెన్నెల పరదాలమాటున వెండిశిల్పంలా ఆ ముగ్ధమోహనరూపం మరలా సాక్షాత్కరించింది.

గుప్పుమని వేలసంపెంగతోటల పరిమళం సోకింది. ఎక్కడినుండో ఏదో నాగస్వరంలా వినిపిస్తున్నది. ఒళ్ళు పులకరించే మత్తైన కంఠం ఏదో వినిపిస్తున్నది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS